పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా

- 7న అనకాపల్లిలో వారాహియాత్ర

కొత్తూరు, ఏప్రిల్ 3: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల ఐదో తేదీన అనకాపల్లిలో నిర్వహించాల్సిన వారాహి విజయయాత్ర వాయిదా పడింది. వ్యక్తిగత కారణాలతో షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయని, ఏడో తేదీన అనకాపల్లిలో పర్యటిస్తారని పార్టీ నేతలు తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు నెహ్రూచౌక్ కూడలిలో నిర్వహించే వారాహి విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు.

పెన్షన్ల పంపిణీలో జాప్యం

ఉద్దేశపూర్వకంగానే సర్కారు చర్యలు

- మధ్యాహ్నం 3 గంటల తరువాత బ్యాంకుల నుంచి నగదు డ్రా
- వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే పంపిణీ ప్రకటనలకే పరిమితం
- సచివాలయాలకు క్యూ కట్టిన పండు ముసలివారు
- అక్కడ కూడా అరకొరగానే సిబ్బంది
- జాప్యానికి తెలుగుదేశమే కారణమనేలా వైసీపీ ఎత్తులు



నర్సీపట్నం పాత మునిసిపల్ కార్యాలయం వద్ద పింఛన్ల కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు

(విశాఖపట్నం/అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీని కావాలనే జాప్యం చేస్తోంది. లబ్ధిదారులంతా ఇబ్బంది పడాలని, దానికి తెలుగుదేశమే కారణమని భావించేలా వ్యవహరిస్తోంది. ఈ ఉద్దేశంతోనే గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి పరిమిత సిబ్బందిని కేటాయించింది. మిగిలిన వారంతా ఇతర వ్యవహారాల్లో బిజీగా ఉన్నారని చెబుతోంది. జిల్లా అధికారులు కూడా పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలనే చెబుతున్నారు కాని త్వరగా పూర్తిచేయాలని ఒత్తిడి పెట్టడం లేదు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది తొలిరోజు (బుధవారం) తీవ్ర జాప్యం చేశారు.

వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు రానవసరం లేదని, వారికి ఇంటి వద్దకే వచ్చి పింఛన్ల మొత్తం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కనీసం ఈ విషయం పింఛన్‌దారులకు తెలిసేలా ప్రచారం కూడా నిర్వహించలేదు. దాంతో పండు ముదుసళ్లు కూడా ఊతకర్ర చేతపట్టుకొని, ఎవరినో ఒకరిని తోడు తీసుకుని సచివాలయాలకు వచ్చారు. బ్యాంకుల్లో డబ్బులు డ్రా చేసి, బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఈ విషయం కూడా వారికి చేరవేయలేదు. దాంతో వారంతా ఉదయం పది గంటలకే సచివాలయాలకు వచ్చి కూర్చున్నారు. అక్కడ కూడా తగిన ఏర్పాట్లు లేవు. కేవలం నలుగురు కూర్చోడానికే కుర్చీలు వేశారు. మిగిలిన వారంతా నిల్చోవాల్సి వచ్చింది. జిల్లాలో తొలిరోజు పింఛన్ల పంపిణీ చాలా మందకొడిగా సాగింది. చాలా సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ బాధ్యతలు తీసుకున్న సిబ్బంది తప్పితే మిగిలినవారు ఎవరూ కనిపించక పోవడం గమనార్హం.

వారంతా ఎక్కడ?

సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ బాధ్యత వీఆర్‌ఓ, వెల్ఫేర్ సెక్రటరీలకు అప్పగించారు. వాస్తవానికి ఆయా కార్యాలయాల్లో ఇంకా చాలామంది ఉద్యోగులు ఉన్నారు. ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, ప్లానింగ్, హెల్త్, ఎనర్జీ సెక్రటరీలు, వారి సహాయకులు మహిళా పోలీసులు ఉన్నారు. వీరంతా ఎన్నికల విధుల్లో ఉన్నారని సమాధానం ఇస్తున్నారు. ఎనర్జీ, ప్లానింగ్, హెల్త్, పోలీస్ సిబ్బందికి ఎటువంటి అదనపు పనులు లేవు. వారికి పింఛన్ల మొత్తం ఇచ్చి, ఇంటింటికీ పంపిణీ చేయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టి ఉండేది. వలంటీర్లతో ఒకటో తేదీనే 90 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేయించేది. అంత మంది సిబ్బందిని పెట్టుకొని రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయాల్సి ఉండగా నాలుగు రోజుల సమయం తీసుకుంటోంది. మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఇస్తామని ప్రకటించారు. కావాలని ఆలస్యం చేసి, ఆ నింద తెలుగుదేశంపైనే నెట్టడానికే వైసీపీ నాయకులు, ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారు.

తొలిరోజు 66,290 మందికి పంపిణీ

జిల్లాలోని 24 మండలాల పరిధిలో 2,66,208 మందికి పింఛన్‌లు అందించాల్సి ఉండగా తొలిరోజు బుధవారం 66,290 మందికి అందజేశారు. 24.9 శాతం పంపిణీ పూర్తయింది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులకు లోబడి వీల్‌ఛైర్‌కి పరిమితమైన వారికి, సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు పొందుతున్న వృద్ధ వితంతువులు, కదలలేని పరిస్థితిలో అనారోగ్యంతో ఉన్నవారు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 200 నుంచి 350 మంది లబ్ధిదారులున్నారు. ఐదు నుంచి తొమ్మిది మంది సిబ్బంది పింఛన్ల బట్వాడా విధుల్లో పాల్గొంటున్నారు. శనివారం వరకు అంటూ మరో మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

అందలేదని ఆందోళన వద్దు....

పింఛన్లు తొలిరోజు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శశీదేవి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని స్పష్టం చేశారు.



టీడీపీలో చేరేందుకు బుచ్చెయ్యపేట నుంచి భారీగా తరలివచ్చిన వైసీపీ నాయకులు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాలసంఘాల అధ్యక్షులు

టీడీపీలోకి వెలాదిగా..

భారీగా చేరిన వైసీపీ నాయకులు

- బుచ్చెయ్యపేటలో అధికార పార్టీ ఖాళీ
- టీడీపీలో చేరిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ
- అతని వెంట ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పాలసంఘాల అధ్యక్షులు
- వందకు పైగా వాహనాలతో చోడవరం వరకు ర్యాలీ
- కండువాలు వేసి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణకు కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజు, మల్లు నాయుడు, నేతలు

చోడవరం, ఏప్రిల్ 3: నియోజకవర్గంలో అధికార వైసీపీకి భారీ షాక్ తగిలింది. బుచ్చెయ్యపేట మండలంలో వైసీపీ కీలకనేత, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణతో పాటు, అతని ఆధ్వర్యంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు పాలసంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు సుమారు వెయ్యిమందికి పైగా నాయకులు కార్యకర్తలు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు దేవుర అప్పారావు, పొట్టిదొరపాలెం ఎంపీటీసీ సభ్యురాలు బద్దుకొండ దేవి, కోమళ్లపూడి, ఎల్.సింగవరం, గొర్లెపాలెం పంచాయతీ సర్పంచులు గేదెల వెంకయమ్మ, వేపాడ మనీషా, నైదాన రాజులతో పాటు, మాజీ సర్పంచ్‌లు కరకాన నాగేశ్వరరావు, చిన్నంనాయుడు, గొంతిన సాయిబాబు, అద్రావు సత్యనారాయణ, దొండా శ్రీనివాసరావు, వై.అచ్చింనాయుడుర, రేణం బాలకృష్ణల, నీలకంఠాపురం, పిన భీమవరం, ఆర్.శివరాంపురం, పెదమదీన, ఆర్.భీమవరం విశాఖ డెయిరీ పాలసంఘాల అధ్యక్షులు డైరెక్టర్లు, స్థానిక నాయకులు, స్కూల్ కమిటీ ఛైర్మన్లు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు.

భారీ ర్యాలీగా...

బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల నుంచి బుధవారం ఉదయం వందకు పైగా కార్లు, ఇతర వాహనాల్లో ర్యాలీగా చోడవరం చేరిన నాయకులకు స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ నేతలు స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, బుచ్చెయ్యపేట మండల టీడీపీ అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు తదితరులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

చంద్రబాబు సారథ్యంలో సత్తాచాటుదాం

అధికార వైసీపీని వీడి గేదెల సత్యనారాయణతో పాటు, భారీగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పాలసంఘాల అధ్యక్షులు టీడీపీలోకి రావడం ఆనందంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంతో పాటు, చోడవరం అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో పార్టీలోకి వచ్చిన వారందరి ఆకాంక్షలకు అనుగుణంగా రానున్న ఎన్నికల్లో కూటమి విజయమే ధ్యేయంగా పనిచేద్దామని ప్రకటించారు. జిల్లాలో అనకాపల్లి ఎంపీతో పాటు, అన్ని నియోజవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయ దుందుభి మోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూతి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ పెదబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మజ్జి గౌరీశంకర్, మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, జనసేన నేత సిరిపురపు రమేష్, బీజేపీ నేత కందర్ప రామకృష్ణ, బుచ్చెయ్యపేట మండల టీడీపీ నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు రాజీనామాలు!

వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్న వైసీపీ నేతలు

- ప్రచారంలో వినియోగించుకునేందుకు ఎత్తులు
- తాయిలాలతో ఆకట్టుకునే యత్నాలు



పాయకరావుపేట మండలం శ్రీరాంపురంలో రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు

(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. వారిపై అధికార వైసీపీ నాయకులు తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చి రాజీనామా చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వలంటీర్లతో విస్తృతస్థాయి ప్రచారం చేయించుకునేందుకు వీలుగా ఈ చర్యలకు దిగారని, కొంతమందికి తాయిలాలు ఎరవేయగా, మరి కొంతమందికి అధికారంలోకి వచ్చాక మళ్లీ తీసుకుంటామని, ఇతర రకాల సహాయం అందిస్తామని ప్రలోభపెడుతున్నట్టు సమాచారం.

అధికారుల గణాంకాల మేరకు జిల్లాలో బుధవారం వరకు 262 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. జిల్లా లోని 24 మండలాల పరిధిలో 8,952 మంది వలంటీర్లు పనిచేస్తుండగా కశింకోట మండలం నుంచి 117 మంది, నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 145 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. గతంలో ఎలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల పరిధిలో వివిధ రకాల ఫిర్యాదుల ఆధారంగా 23 మంది వలంటీర్లను ... మిగతా 8వ పేజీలో



చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్



85 / 39 సునీల్ నరైన్

55 / 25

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 106 పరుగుల తేడాతో విజయం

- శివమెత్తిన సునీల్ నరైన్
- తొలిమ్యాచ్‌లో అర్ధ సెంచరీతో రాణించిన రఘువన్షి
- స్టేడియంలో షారుక్ ఖాన్ సందడి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 3: కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు బ్యాట్స్‌మెన్ బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని సిక్సర్లు, బౌండరీలతో హోరెత్తించారు. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ 106 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 272 పరుగులు భారీస్కోరు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్ రెండో ఓవర్ నుంచే రెచ్చిపోయారు. దీంతో 4.1 ఓవర్‌లోనే జట్టు స్కోరు 50 పరుగులకు చేరింది. ధాటిగా ఆడిన నరైన్ కేవలం 21 బంతుల్లో ఆరు బౌండరీలు, నాలుగు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. నరేన్‌కు ఫిల్ సాల్ట్ (18) స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రఘువన్షీ తోడవ్వడంతో స్కోరు బోర్డు మరింత వేగం పుంజుకుంది. అద్భుతమైన షాట్లతో అలరించిన రఘువన్షీ తన ఐపీఎల్ కెరీర్‌లో ... మిగతా 8వ పేజీలో

రిషబ్ పంత్



అభిమానులకు షారూఖ్ అభివాదం

నర్సీపట్నం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్, డీఆర్వోకు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 3: ఎన్నికల నిబంధనలను తుంగలోకి తొక్కి, వలంటీర్లతో సమావేశం నిర్వహించిన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని కోరారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ఎన్నికల అధికారి రవిపట్టన్‌శెట్టితో పాటు డీఆర్వో దయానిధిని కలిసిన అయ్యన్నపాత్రుడు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు గృహంలో ... మిగతా 8వ పేజీలో

15 మంది వలంటీర్లు తొలగింపు

- ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసిన పోలీసులు

నర్సీపట్నం, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా వైసీపీ నేత ఇంట్లో జరిగిన సమావేశంలో వలంటీర్లు పాల్గొనడంపై పట్టణ పోలీసు కేసు నమోదు చేశారు. మునిసిపాలిటీలోని 22వ వార్డు వెంకునాయుడు పేటలో మంగళవారం సాయంత్రం వైసీపీ నేత రాంగోపాల్ ఇంట్లో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ వలంటీర్లుతో సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి వరకు వెంకునాయుడు పేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నియమావళి ఉల్లంఘన కింద 15 మంది వలంటీర్లు పై సెక్షన్ 188 ప్రకారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జయరాం వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. అదే విధంగా వైసీపీ నేత రాంగోపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో టీడీపీ శ్రేణులు ధనిమిరెడ్డి మధుబాబు, పెదిరెడ్ల చింతు, ధనిమిరెడ్డి మల్లి, కట్టా నాగు, ధనిమిరెడ్డి తాతాజీ, రాజా మరికొందరి పై 448, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ కాంతికుమార్ తెలిపారు. ముందు జాగ్రత్తగా వెంకునాయుడుపేటలోని వైసీపీ నాయకుడు రాంగోపాల్ ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సి-విజిల్‌తో ఉల్లంఘనలకు చెక్!

పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం

(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై పౌరులు తమ ఫోన్ నుంచే ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ఆధారంగా జిల్లా కేంద్రంలో పనిచేసేందుకు కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఈ విభాగంలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీల నేతలు నగదు, ఇతర సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే, సి-విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయవచ్చు. అంతే కాకుండా ప్రచారంలో





కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న సిబ్బంది

భాగంగా కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా నాయకులు, కార్యకర్తలు చేసే ప్రసంగాలను రికార్డు చేసి అప్‌లోడ్ చేయవచ్చు. ఈ యాప్‌కు ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో అధికారులు చర్యలకు ఉపక్రమిస్తారు. యాప్‌లోని జీపీఎస్ మ్యాప్స్ ఫీచర్ దానంతట అదే లొకేషన్‌ను గుర్తిస్తుంది. వెంటనే సంఘటన జరిగిన ప్రాంతానికి స్క్వాడ్ అధికారులు చేరుకుంటారు. ఫిర్యాదులో వివరాల ఆధారంగా తనిఖీలు నిర్వహిస్తారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి రుజువైతే చర్యలు చేపడతారు. ఫిర్యాదు ధ్రువీకరించి ఎన్నికల సంఘానికి చెందిన నేషనల్ గ్రీవెన్స్ పోర్టల్‌కు పంపుతారు. ఫిర్యాదు చేసిన వ్యక్తికి వంద నిమిషాల్లో దాని వివరాలు తెలియజేసేందుకు ఏర్పాట్లు చేశారు. భారతీయ పౌరుడు ఎవరైనా ఈ యాప్‌ను తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికల వేళ ఎక్కడైనా కోడ్ ఉల్లంఘన జరిగినట్లు గుర్తిస్తే ఆ సంఘటనకు సంబంధించిన లైవ్ ఫొటోలు, వీడియోలను యాప్ ద్వారా (అప్‌లోడ్) పంపవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు, ఫోన్ నంబర్లను ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.14
సహరి (శుక్ర)	4.35

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


చికిత్స పొందుతూ మృతిచెందిన రాజబాబు

కొయ్యూరు, ఏప్రిల్ 3: రొంపుల ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన గుడివాడ రాజబాబు(28) మంగళవారం ఉదయం చోద్యం నుంచి గూడెం మండలం పెదవలస గ్రామానికి ట్రాక్టరులో ఇసుక తీసుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రొంపుల ఘాట్ రోడ్డు చినకాట్రగెడ్డ గ్రామం వద్ద మలుపులో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజబాబు అపస్మారక స్థితికి చేరాడు. ప్రమాద ఘటనను గుర్తించిన ప్రయాణికులు అంబులెన్సులో కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు.

అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ రాజబాబు మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్టు కొయ్యూరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. కాగా, రాజబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని మృతితో కుటుంబీకులు భోరున విలపిస్తున్నారు.

రూ.3.56 లక్షల నగదు స్వాధీనం

రోలుగుంట, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇటీవల కాలంగా నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో రూ.3.56 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సురేశ్ బుధవారం తెలిపారు. వీటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అధిక మొత్తంలో నగదును తీసుకువెళ్లేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందిగా సూచించారు.

11 కిలోల గంజాయి స్వాధీనం

పెదబయలు, ఏప్రిల్ 3 : మండల కేంద్రం పెదబయలు సమీపం ఆంధ్ర- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గల వంతెన వద్ద పదకొండు కిలోల గంజాయితో ఓ వ్యక్తి పట్టుబడినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్-3 ఆఫీసర్, ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు తెలిపారు. బుధవారం పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇంతలో ఒడిశా నుంచి ఆంధ్రా వైపు వస్తున్న ఓ సర్వీసు ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు తమను చూసి ఆటోలో నుంచి పారిపోతున్నారన్నారు. అనుమానం వచ్చి సిబ్బంది వెంబడించగా, గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన షేక్ సుభానీ పట్టుబడ్డాడన్నారు. అనంతరం అతడి వద్ద గల బ్యాగును తనిఖీ చేయగా, పదకొండు కిలోల గంజాయి లభ్యమైనట్టు చెప్పారు. ఒకే ప్రాంతానికి చెందిన ఈ ఇద్దరూ ఒడిశాలో గంజాయిని కొని పాడేరు మీదగా విశాఖపట్నం చేరుకొని విక్రయిస్తుంటారన్నారు. నిందితుడ్ని పెదబయలు స్టేషన్‌కు అప్పగించినట్టు చెప్పారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

రోలుగుంట, ఏప్రిల్ 3: మండలంలోని ఎంకేపట్నం శివారులో బుధవారం నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టగా, ఎంకేపట్నానికి చెందిన రొంగలి సత్తిబాబు వద్ద ఈ గంజాయి పట్టుబడడంతో అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఐపీఎల్ హుషారు


బౌలింగ్ చేస్తున్న ఇషాంత్ శర్మ


వికెట్‌పడిన ఆనందంలో కోల్‌కతా ఆటగాళ్లు


ఫిలిప్ సాల్ట్ బ్యాటింగ్


స్టేడియంలో అభిమానుల సందడి


మ్యాచ్‌ను తిలకిస్తున్న షారూఖ్ ఖాన్

పారదర్శకంగా ఎన్నికల ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓట్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులతో సహా ఎన్నికల ముందస్తు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే వారం ఎన్నికల సిబ్బంది మొదటి రాండమైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. వేయి ఓటర్లు లోపు ఉన్న పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, నలుగురు ఓపీఓలు, వేయికి మించితే పీవో, ఐదుగురు ఓపీఓలు ఉంటారని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపున సంబంధించి ప్రతి కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించి ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, పార్లమెంట్‌కు సంబంధించి ఏడు (పెందుర్తితో కలిపి) నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అనకాపల్లిలోనే జరుగుతుందని వివరించారు. సి-విజిల్, ఆర్వోలకు ఇచ్చిన ఫిర్యాదులు, దినపత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలకు సబంధించి ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నామన్నారు.

ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే జిల్లాలో పింఛన్ పంపిణీ జరగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు (టీడీపీ), ఐఆర్ గంగాధర్ (కాంగ్రెస్), రత్నల శంకర్రావు (సీపీఎం), కె.హరనాథబాబు (ఆమ్‌ఆద్మీ), పి.నాగేశ్వరరావు (బీజేపీ), కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి పి.ప్రసాద్, ఆడిటర్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలకు సబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి డీడీపీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

టోల్ ఫ్రీ నెంబర్ 1950, ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్ 08924-226599 లకు ఫోన్ చేసి ఎన్నికలకు సబంధించిన గ్రీవెన్స్‌ను తెలియజేయాలని సూచించారు.

24 గంటలూ అందుబాటులో ఉంటామని వివరించారు.

మత్స్యకారులు సురక్షితం

- అప్పికొండ తీరానికి చేరిక


అప్పికొండలోని ఓ ఇంట్లో భోజనం చేస్తున్న మత్స్యకారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 3: సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఆరుగురు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారు. బుధవారం ఉదయం అప్పికొండ తీరానికి చేరుకున్నారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం...విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం సాయంత్రం ఐఎన్‌డి-ఏపీ-2736 నంబరు గల బోటులో కర్రి చిన్నారావు, కర్రి నరేంద్ర, కర్రి సత్తెయ్య, వాసుపల్లి అప్పన్న, పొడుగు అప్పన్న, మైలపల్లి మహేష్‌లు వేటకు వెళ్లారు. అలల ఉధృతికి మంగళవారం సముద్రంలో బోటు బోల్తాపడింది. దీంతో ఆరుగురు బిక్కుబిక్కుమంటూ రాత్రంతా బోటు పై భాగంలో ఉండిపోయారు. అదేబోటును ఆసరాగా చేసుకుని బుధవారం తెల్లవారుజామున అప్పికొండ తీరానికి చేరుకున్నారు. దగ్గరలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు అప్పికొండ వెళ్లారు. మత్స్యకారులను మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌కు అప్పగించారు.

శ్రీరాంపురంలో 19మంది వలంటీర్లు రాజీనామా

- వైసీపీ నాయకుడు సమక్షంలో వెల్లడి

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 3 : మండలంలోని శ్రీరాంపురం పంచాయతీ పరిధిలో గల వలంటీర్లు బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు సమక్షంలో రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ గ్రామంలో 19మంది వలంటీర్లు పనిచేస్తుండగా, తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గెడ్డమూరి శ్రీనువాసరావు, టి.నరసింహరాజు, బోడపాటి గోవింద్ పులగల రాంబాబు, బావారపు అప్పారావు, పులగల భద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారాల్లో గానీ, పెన్షన్ల పంపిణీలో గానీ వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో వలంటీర్లు రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

'ఎయిడ్స్, క్షయ నివారణకు ప్రత్యేక దృష్టి'

సబ్బవరం, ఏప్రిల్ 3 : మండలంలో ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి ఎంవీ ఎస్‌కే బాలాజీ సూచించారు. ఇక్కడి పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశ, డాక్టర్ విధ్యాధరి, సీహెచ్‌వో వై .స్వర్ణలత, ఎంపీహెచ్‌ఈవో జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఉపమాకలో అవగాహన సదస్సులో సీఐ విజయ్‌కుమార్


ఉపమాక గ్రామస్థులతో సమావేశమైన సీఐ విజయ్ కుమార్

నక్కపల్లి, ఏప్రిల్ 3 : 'మీకు లాటరీ తగిలిందని, లేదా ఈ లింక్ ఓపెన్ చేస్తే బోనస్ వస్తుందని, మీకు జాబ్ కావాలంటే ఈ మెసేజ్‌కు సమాధానం ఇవ్వండి' అని వాట్సాప్‌లలో సైబర్ నేరగాళ్లు పంపే లింక్‌లను ఓపెన్ చేయవద్దని సీఐ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ఉపమాక గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. తప్పుడు మెసేజ్‌ల వల్ల మోసపోవద్దన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఖాతాల్లో నగదు మాయం ఖాయమన్నారు. ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అంతా సహకరిచాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పోలీసులు సిబ్బందితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఎమ్మెల్యే కన్నబాబు ప్రజల ఆస్తులు దోచుకున్నారు

- అందుకే ఓట్లు అడిగేందుకు భయం
- మధ్యవర్తి ద్వారా నాతో సంప్రదింపులు
- కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేశ్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేశ్

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 3: ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు నియోజకవర్గ ప్రజల ఆస్తులను దోచుకున్నారని బీజేపీ నాయకుడు, అనకాపల్లి ఎంపీ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేశ్ ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి బుధవారం ఆయన అచ్యుతాపురంలో పర్యటించారు. తొలుత చోడపల్లి నుంచి భారీగా ర్యాలీగా కొనేపాలెంలో గల ఫంక్షన్ హాలుకు చేరుకుని మాట్లాడారు. ప్రజల ఆస్తులను దోచుకుంటూ, నమ్మక ద్రోహానికి తలపడిన ఎమ్మెల్యే కన్నబాబు నేడు ఓట్లను అడగడానికి భయపడుతున్నారన్నారు. కన్నబాబు స్నేహితుడు ఒకరు తనను కలిసి ఎలమంచిలి ఎన్నికలలో జోక్యం చేసుకోకపోతే ఎంపీ ఓట్ల విషయంలో సహకరిస్తానని మంతనాలు జరపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను జనసేన అభ్యర్థిగా ఇక్కడ బరిలో సుందరపు విజయ్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. త్వరలో ప్రధాన మంత్రి మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ప్రచారాలకు రానున్నారన్నారు.

ఎన్నో అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌ను ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. ఎలమంచిలి ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ, జనసేనలది అన్నదమ్ముల అనుబంధం లాంటిదన్నారు. ఎలాగైనా వాటిని విడగొట్టడానికి వైసీపీనాయకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కాదన్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి జిల్లా అభివృద్ధికి దోహదపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరంమాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు డ్రీమ్స్ నాయుడు, మేరుగు బాపునాయుడు, మామిడి శివ అప్పారావు, పి.నాగేశ్వరరావు, జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రామదాసు, ఆడారి మంజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో వైసీపీ తాయిలాలు

- ఓటర్లకు రైస్ కుక్కర్లు
- ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడులు
- కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కార్యకర్తల దాడి


తారామసీదు ఏరియాలో ఫ్లైయింగ్ స్క్వాడ్ పట్టుకున్న రైస్‌కుక్కర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 3: విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 22వ వార్డు తారామసీదు ఏరియాలో బుధవారం రాత్రి వైసీపీ నాయకులు రైస్‌కుక్కర్లు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆటోల్లో గంగ బ్రాండ్ రైస్‌కుక్కర్లను (5.5 లీటర్స్) తీసుకొచ్చి రోడ్డుపై దింపారు. ఈ సమాచారం ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అందడంతో అక్కడకు చేరుకుని రైస్‌కుక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీస్తున్న మీడియా ప్రతినిధులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. 'ఈనాడు', 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై దాడి చేసి కెమెరాలు లాక్కున్నారు. దీంతో దాడులు చేసిన వారిని పోలీసులు చెదరగొట్టారు. ఈ గందరగోళంలో స్థానికులు కొంతమంది రైస్‌కుక్కర్లను ఎవరికి దొరికింది వారు పట్టుకునివెళ్లిపోయారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన పీఏసీఎస్ ఉద్యోగి సస్పెండ్

రోలుగుంట, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన రోలుగుంట పీఏసీఎస్ కార్యాలయ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మడ్డు తాతబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. కొండపాలెం గ్రామానికి చెందిన పిల్లా నూకరాజు రోలుగుంట పీఏసీఎస్ కార్యాలయంలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కాగా, గత నెల 31న రోలుగుంట సాయిబాబా గుడి సమీపంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి శ్యామల, నియోజకవర్గ ఆర్‌వో చిన్నికృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీంతో క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు విచారణ చేపట్టి అనంతరం అందిన నివేదిక ఆధారంగా జిల్లా సహకార శాఖ అధికారిణి (డీసీవో) ప్రేమ స్వరూపారాణి ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి బాధ్యతలను స్టాఫ్ అసిస్టెంట్ మడ్డు గణేశ్‌కు అప్పగించారు.

ఇద్దరి అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు


బీఎస్‌వీ కృష్ణ (ఫైల్ ఫొటో)


కె.రాణి (ఫైల్ ఫొటో)

అక్కిరెడ్డిపాలెం (విశాఖపట్నం), ఏప్రిల్ 3: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నగరంలోని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో మంగళవారం వీరిద్దరి అవయవాలను సేకరించారు. ఇందుకు సంబంధించి బుధవారం జీవన్‌దాన్ వైద్య అధికారులు, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాలివి...విశాఖలోని సీతమ్మపేటకు చెందిన బీఎస్‌వీ కృష్ణ (50) ఒక జ్యువెలరీ దుకాణంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 29వ తేదీన విధుల్లో భాగంగా రాజమండ్రి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ఎలమంచిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, కృష్ణ బ్రెయిన్‌డెడ్ కావడంతో మంగళవారం ఆయన కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఊపిరితిత్తులను సేకరించిన జీవన్‌దాన్ వైద్య సిబ్బంది వాటిని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి గ్రీన్‌ఛానల్ ద్వారా తరలించారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన కొవ్వూరి రాణి (50) గత నెల 29వ తేదీన స్కూటీ పై నుంచి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. చికిత్స కోసం రాజమండ్రిలోని ఆసుపత్రిలో చేర్పగా... అక్కడ నుంచి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో తీసుకువచ్చారు. రాణికి బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించిన వైద్యులు ఆ విషయం కుటుంబసభ్యులకు తెలపగా...అవయవ దానానికి అంగీకారం తెలిపారు. దీంతో రాణి కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులను సేకరించారు. కృష్ణ, రాణి అవయవాలను జీవన్‌దాన్‌లో నమోదు చేసుకున్న నలుగురికి అమర్చినట్టు వైద్యులు తెలిపారు.

పాడేరు ఘాట్‌లో ఘోరం

▸ అదుపు తప్పి లోయలోకి బోల్తా పడిన బొలేరో
▸ ఇద్దరు మృతి : 30 మందికి గాయాలు

పాడేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్ రోడ్డులో బుధవారం రాత్రి ఘోరం జరిగింది. ప్రయాణికులతో కిక్కిరిసిన బొలేరో అదుపుతప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒక మహిళ (35), పురుషుడు(40) మృతి చెందగా మరో 30 మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి..

ఒడిశా రాష్ట్రం నుంచి కూలి పనుల కోసం 32 మంది బొలేరో వాహనంలో బుధవారం విజయవాడ బయలుదేరారు. పాడేరు మీదుగా మైదాన ప్రాంతానికి చేరే క్రమంలో రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో స్థానిక ఏసుప్రభు బొమ్మ మలుపునకు ముందున్న మలుపు వద్ద వాహనం అదుపు తప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఒక మహిళ, మరో పురుషుడు అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్‌తో సహా మరో 30 మందికి గాయాలయ్యాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారు గమనించి బొలేరోలో చిక్కుకున్న వారికి లోయలోంచి బయటకు తీశారు. అంబులెన్సులకు సమాచారం ఇచ్చి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా కూలీలేనని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రాత్రి సమయంలో సంఘటన జరగడంతో మృతులు, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

14 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 : పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద 14 మద్యం బాటిళ్లను బుధవారం ఓ వ్యక్తి వద్ద స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. కొప్పాకకు చెందిన సయ్యపురెడ్డి ఈశ్వరరావు మద్యం కొనుగోలు చేసి ఓ సంచిలో పట్టుకుని వెళ్తుండగా పట్టుకున్నామన్నారు.

నర్సీపట్నం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి మరీ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని ప్రశ్నించడంతో ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ కారులో ఎక్కి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. ఆయనపై చర్యలు తీసుకోకుండా పోలీసులు వలంటీర్లను స్టేషన్‌కు తరలించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. చిన్నపాటి వ్యవస్థలో పనిచేస్తున్న వలంటీర్లపై కేసులు పెట్టి, సమావేశం ఏర్పాటుచేసిన కీలక వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పై కేసు నమోదు చేయాలని కోరారు. నర్సీపట్నం: వలంటీర్లతో సమావేశం నిర్వహించిన సంఘటనపై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, ఇంటి యజమాని కర్రి రాంగోపాల్‌పై కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు. వలంటీర్లతో ఓటర్లుకు డబ్బులు పంచి ప్రలోభపెట్టేందుకే సమావేశం నిర్వహించారని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు.

సి-విజిల్‌తో ఉల్లంఘనలకు చెక్!

... 5వ పేజీ తరువాయి

గోప్యంగా ఉంచుతారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండిలా....

సి-విజిల్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇన్‌స్టాల్ చేసేందుకు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గ కేంద్రాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఫొటోలు, వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేసి ఉన్నతాధికారులకు పంపవచ్చు. అయితే ఆ సమయంలో మొబైల్‌లో జీపీఎస్ ఆన్‌లో ఉంచాలి. దాని ఆధారంగానే అధికారులు సంబంధిత ప్రాంతానికి చేరుకోగలరు.

ఫిర్యాదుల వెల్లువ....

జిల్లాలో ఇప్పటివరకు సి-విజిల్ యాప్‌కు 371 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి ప్రసాద్ తెలిపారు. ఎక్కువగా పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 150కిపైగా ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో అధికంగా పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించలేదని, విగ్రహాలకు ముసుగులు వేయలేదని, భవనాలకు, శిలాఫలకాల రంగులు మార్చలేదనేవే ఉన్నాయని, వాటిని పరిశీలించి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

బలవంతపు రాజీనామాలు!

... 5వ పేజీ తరువాయి

తొలగించారు. దీంతో జిల్లాలో మొత్తం 285 మంది వలంటీర్లు విధుల నుంచి తప్పుకున్నారు. ఆది నుంచీ వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను ఎన్నికల్లో వాడుకోవాలని భావించింది. ఇందులో భాగంగానే సంక్షేమ కార్యక్రమాలకు వారితోనే ప్రచారం చేయించడంతో పాటు ఇంటింటికీ వెళ్లి అందించేలా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఈ ప్రక్రియ కొనసాగగా, వలంటీర్లు కార్యకర్తలను మించిపోయేలా వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తుండడంతో ఎన్నికల సంఘం రంగంలోకి దిగి కట్టడి చేసింది. ప్రధానంగా పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బందితో చేపట్టాలని ఆదేశించింది. దీంతో వలంటీర్లనే నమ్ముకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావించిన వైసీపీ నేతలకు ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో రంగంలోకి దిగిన కొంతమంది నాయకులు వలంటీర్లతో రాజీనామా చేయించి, ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలని కుయుక్తులు పన్నుతున్నారు. రాత్రిపూట రహస్య ప్రదేశాలలో వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొందరైతే ఏకంగా వలంటీర్లకు తాయిలాలు అందించి పార్టీ కార్యకర్తలుగా మార్చేశారు. వాస్తవానికి వలంటీర్లకు తమ బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఇష్టం లేకపోయినా వైసీపీ నాయకులు ఒత్తిడి తెచ్చిమరీ రాజీనామా చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వలంటీర్ల రాజీనామా వెనుక ఎవరి ఒత్తిడి ఉందో విచారణ జరిపించాలని విపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పెన్షన్లపై ప్రభుత్వం నీచ రాజకీయం

▸ కావాలనే పంపిణీని జాప్యం చేసి, కూటమిపై నెట్టేందుకు కుట్ర ▸ జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఎన్నికల్లో ఓటమి తథ్యం : అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 3 : వృద్ధులు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్‌పై కూడా వైసీపీ నేతలు నీచ రాజకీయం చేసి, కూటమి పార్టీలపై దుష్ప్రచారానికి ఒడిగట్టారని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, పాయకరావుపేట కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గొడిచెర్ల, గొడిచెర్ల కొత్తూరు, డొంకాడ, రమణయ్యపేట గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీని ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తోందన్నారు. ఇందుకు కారణం కూటమి పార్టీలని నమ్మించే కుట్ర చేస్తోందని, దీనిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఇలాంటి కుయుక్తులు ఎన్ని పన్నినా ఈ ఎన్నికలో వైసీపీకి భంగపాటు తప్పదని, జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమని ఆమె స్పష్టం చేశారు. ఆ జనసేన నేత గెడ్డం


డొంకాడలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థిని అనిత, చిత్రంలో గెడ్డం బుజ్జి

బుజ్జి, బీజేపీ నాయకులు రవిరాజు, పోలినాటి నానాజీ, కోసూరి శ్రీను, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, వైబోయిన రమణ, కురందాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో జిల్లాకు ఒక్క పరిశ్రమైనా తెచ్చారా..

▸ వైసీపీ ప్రభుత్వానికి అనకాపల్లి ఉమ్మడి అభ్యర్థి 'కొణతాల' ప్రశ్న


సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఏప్రిల్ 3 : అనకాపల్లి మండలం వల్లూరు, ఎరుకువానిపాలెం, రాజుపాలెం గ్రామాల్లో బుధవారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమాన్ని జనసేన పార్టీకి చెందిన అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బీజేపీ పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్ తనయుడు రిత్విక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో సీఎం జగన్ భ్రష్టుపట్టించారన్నారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉన్న ఈ ప్రాంతంలో ఐదేళ్లలో ఒక్క పరిశ్రమనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, నాయకులు డాక్టర్ నారాయణరావు, బీఎస్ఎంకే జోగినాయుడు, గొల్లవిల్లి బాబూరావు, గొర్లి రాము, బీజేపీ నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు మళ్ల శ్రీను, గొల్లవిల్లి సూరప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొణతాలను కలిసిన దాడి జయవీర్

ఇదిలావుంటే, కొణతాల రామకృష్ణను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తనయుడు జయవీర్ బుధవారం రింగురోడ్డులోని జనసేన కార్యాలయంలో కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. తమకు ఏ బాధ్యతలు అప్పగించినా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఏటికొప్పాక నుంచి 'సుందరపు' ప్రచారం ప్రారంభం


ఏటికొప్పాకలో ప్రచారం చేస్తున్న సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల్లో ఎలమంచిలి నియోజకవర్గ నుంచి పోటీ చేస్తున్న జనసేన నాయకుడు సుందరపు విజయ్‌కుమార్ బుధవారం ఏటికొప్పాక నుంచితన ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని తొలుత బండి మాంబ ఆలయంలోపూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుకు సాగారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. నాయకులు రాజాన రమేష్, కాండ్రకోట చిరంజీవి, కొలుకులూరి విజయ్‌బాబు, బి.శ్రీరామదాసు, అన్నం వెంకట్రావు, అన్నం బాబ్జీ, గొన్నాబత్తుల శేషు, బొద్దపు శ్రీను, గెంజి శ్రీను, పప్పు ఈశ్వరరావు, నక్కా శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో తేదీన వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 : పట్టణంలోని రింగురోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల ఆరో తేదీన వైసీపీ విస్తృతస్థాయి సమావేశం జరగనుందని ఎంపీ డాక్టర్ సత్యవతి, అనకాపల్లి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి భరత్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరు కానున్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు హాజరుకావాలని కోరారు. విలేకరుల సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, గొర్లి సూరిబాబు, మందపాటి జానకి రామరాజు, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ : డ్రైవర్లకు గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన లారీ ముందు భాగం

కశింకోట, ఏప్రిల్ 3: మండలంలోని తాళ్లపాలెం కూడలిలో రెండు లారీలు ఢీకొన్న సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. విశాఖపట్నం నుంచి మాకవరపాలెం వైపు ఐరన్ ఓర్‌తో వెళ్తున్న లారీ, రాజమండ్రి నుంచి విశాఖ వస్తున్న ఇసుక లోడు లారీ తాళ్లపాలెం కూడలిలో ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో వాటి ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్లకు స్వల్పంగా గాయాలయ్యాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది.

'వైసీపీ చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది'

కోటవురట్ల, ఏప్రిల్ 3 : ఐదేళ్ల వైసీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులే తమను ఈ ఎన్నికల్లో గెలిపిస్తాయని ఆ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం కోటవురట్లలో పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీసూర్యనారాయణరాజు, సాగి సీతబాబు (దత్తుడు), నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు, పైలరమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా కూటమికి మద్దతు ఇద్దాం'

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 : ఎన్నికల్లో ఇండియా కూటమిని అంతా గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథంతో కోరారు. బుధవారం ఇక్కడ అనకాపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి ఐఆర్ గంగాధర్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఐటీయూ నాయకుడు రుత్తల శంకరరావు, సీపీఎం నాయకుడు గంటా శ్రీరామ్, కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, ఎస్. గజ్జాలు, కొల్లి సత్యారావులు పాల్గొన్నారు.

కూటమికి యాత సంక్షేమ సంఘం మద్దతు


కూటమికి మద్దతు తెలుపుతున్న సంఘం నేతలు

సబ్బవరం, ఏప్రిల్ 3: పెందుర్తి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లకు యాత సంక్షేమ సంఘం పెద్దలు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు స్థానిక బీజేపీ కార్యాలయంలో వారు పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాసనాయుడును కలిసి తమ మద్దతు తెలిపారు. సంఘం ప్రతినిధులు కాకార నాని, నానాజీ, నెల్లి గోపీ, సమ్మంగి రమణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వనం సత్యనారాయణ, కో-కన్వీనర్ రెడ్డి రామునాయుడు, కె.శ్రీనివాస్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 50 కుటుంబాలు చేరిక

నక్కపల్లి, ఏప్రిల్ 3 : ఎస్.రాయవరం మండలం కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు మాజీ సర్పంచ్ చింతకాయల గంగరాజు ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక్కడున్న తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత నివాసం వద్ద టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నల్లపరాజు వెంకట్రాజు నేతృత్వంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. వీరికి అనిత సాదరంగా ఆహ్వానించారు.

నేడు టీడీపీ గూటికి గూటూరు శ్రీను



పాయకరావుపేట, ఏప్రిల్ 3 : వైసీపీ నుంచి ఇటీవల సస్పెండైన పాయకరావుపేటకు చెందిన ముఖ్య నాయకుడు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు తన అనుచరులతో కలిసి గురువారం టీడీపీలో చేరనున్నారు. గతంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా, తాండవ షుగర్స్ సీడీసీ చైర్మన్‌గా పనిచేసిన గూటూరు శ్రీనివాసరావుకు సీనియర్ రాజకీయ నాయకుడిగా పేరుంది. 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరి గొల్ల బాబూరావుకు ముఖ్య అనుచరుడిగా పనిచేశారు. అయితే గత కొంతకాలంగా పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వస్తున్న ఆయన, పలుమార్లు ఎమ్మెల్యే ఎదుట తన అనుచరులతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో అధిష్ఠానం ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం నుంచి పలు పార్టీలు అతనిని ఆహ్వానించాయి. చివరకు టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. కాగా గురువారం పాయకరావుపేటలో నిర్వహించనున్న కార్యక్రమంలో తన అనుచరులు సుమారు 300 మందితో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో టీడీపీలో చేరనున్నట్టు ఆయన ప్రకటించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

కశింకోట, ఏప్రిల్ 3 : వెదురుపర్తిలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం పలువురు రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. భూసార పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు మాట్లాడుతూ భూమిని సారవంతంగా ఏ విధంగా తయారు చేయాలనే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వీఏవో సింధూజ, రైతు క్లబ్ కన్వీనర్ ముక్కా పాండురంగా, కో-కన్వీనర్ వెలుగులు ఈశ్వరుడు, బీసీటీ సామాజిక కార్యకర్త పి.ఎ.నాయుడు, ఎ.సుధాకర్, సర్పంచ్ శనివాడ అరుణ, ఎ.హరి తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కశింకోట, ఏప్రిల్ 3 : ఇక్కడి ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ హాజరయ్యే విద్యార్థులకు కోచింగ్‌తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామని ప్రిన్సిపాల్ కె.శివ తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకును పొందాలని ఆకాంక్షించారు. విభాగాధిపతులు గణేష్, రమణకుమార్, శివరాం, జగజ్జ్యోహిని, వీరేంద్ర, జగదీష్, జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక విద్యలో రాణించాలి

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 3 : మండల కేంద్రం మునగపాకలో స్పందించే హృదయం, షిర్డిసాయి లా కళాశాల ఆధ్వర్యంలో పాలిసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు టెక్నికల్ విద్యలో రాణించడమే తమ లక్ష్యంగా హృదయం సంస్థ వ్యవస్థాపకుడు ఏవీఎస్ మూర్తి తెలిపారు. సంస్థ చైర్మన్ తమ్మిరాజు, సభ్యులు కేవీ రమణ, జోగారావు, సత్యనారాయణమూర్తి, సతీష్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు కంటి పరీక్షలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సభ్యులందరికీ ఉచితంగా కంటి పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీపతి, ఎంబీవీ స్వామి, కె.లక్ష్మణరావు, నల్లల దేవుళ్లు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం


ఉపమాక మాఢవీధుల్లో దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, ఏప్రిల్ 3 : ఉపమాకలో సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి నూతన విగ్రహాల ఊరేగింపు ఘనంగా జరిగింది. మెరకవీధి రామాలయానికి నూతన విగ్రహాలను సమకూర్చారు. బుధవారం ఉదయం ఉపమాక ఆలయం నుంచి మాడవీధుల్లో వీటిని భక్తుల రామనామస్మరణ మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, రామాలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రతిష్ఠించిన విగ్రహాల

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్. రాయవరం రెల్లి వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, వైస్ ఎంపీపీ, వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.


ఎస్.రాయవరం రెల్లి వీధిలో విగ్రహాలకు భక్తులకు పూజలు

చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్

... 5వ పేజీ తరువాయి

తొలి అర్ధ సెంచరీ (54; 3 సిక్సర్లు, 5 బౌండరీలు) సాధించాడు. మరోవైపు కేవలం 39 బంతుల్లో ఏడు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 85 పరుగులు చేసిన సునీల్ నరైన్ (85) రెండో వికెట్‌గా అవుటయ్యాడు. ఆ తర్వాత స్థానాల్లో దిగిన ఆండ్రూ రస్సెల్ (41), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (18), రింకూ సింగ్ (26) సిక్సర్లు, బౌండరీలతో విరుచుపడడంతో జట్టు స్కోరు 272 పరుగులకు చేరింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిషబ్ పంత్ (55), స్టబ్స్ (54) అర్ధ సెంచరీలు సాధించగా, మిగిలిన బ్యాట్స్‌మెన్లు ఘోరంగా విఫలమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి తలో మూడు వికెట్లు పడగొట్టగా, మిచెల్ స్టార్క్ రెండు వికెట్లు తీశాడు.

షారుఖ్ ఖాన్ సందడి

గోపాలపట్నం (విశాఖపట్నం), ఏప్రిల్ 3: స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించడానికి ఆయా జట్ల యజమానులు ప్రత్యేక విమానాల్లో నగరానికి చేరుకున్నారు. ముంబై నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసిన బాలీవుడ్ నటుడు, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్‌కు విమానాశ్రయంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో స్టేడియానికి వెళ్లారు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ జిందాల్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి వచ్చారు.



నాడు టీచర్లను మద్యం షాపుల వద్ద పెట్టిన ప్రభుత్వం.. నేడు పెన్షన్లు ఇప్పించలేదా..?

▸ ప్రతిపక్షాలపై తప్పుడు ప్రచారం చేస్తూ జాప్యం ▸ పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలి : అధికారులకు టీడీపీ నేతల వినతి

నక్కపల్లి, ఏప్రిల్ 3 : పెన్షన్ల పంపిణీలో కావాలనే ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, మూడో తేదీ వచ్చినా ఇవ్వకపోవడం వెనుక దురుద్దేశం ఉందని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజులకు వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో వైన్‌షాపుల వద్ద ఉపాధ్యాయులను పెట్టిన ప్రభుత్వం, పెన్షన్లను వారి ద్వారా పంపిణీ చేసే ఏర్పాట్లు చేయలేదా.. అని ప్రశ్నించారు. సచివాలయ సిబ్బందితో ఎందుకు సకాలంలో పంపిణీ చేయలేకపోతోందని నిలదీశారు. ఇప్పటికైనా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నక్కపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు అడ్డూరి లోవరాజు, మాజీ సర్పంచ్ మీసాల బాబులు, అల్లాడ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించినా బ్యాంకుల్లో పింఛన్ల సొమ్ము జమకాకపోవడంతో పాయకరావుపేటలో బుధవారం సాయంత్రం ఆరు గంటలు అవుతున్నా పింఛన్ల పంపిణీ జరగలేదు. దీంతో పింఛన్ సొమ్ముకోసం ఆయా సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, వితంతువులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. వీరి చూసిన పలువురు ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదని తెలిసి కూడా ఇన్నాళ్లూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించకపోవడం ఏమిటని తప్పుబడుతున్నారు.

పరవాడ : మండల వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమైంది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు పెన్షన్ల కోసం ఆయా సచివాలయాలకు తరలివెళ్లారు. కొన్నిచోట్ల బ్యాంక్ నుంచి నగదు ఆలస్యంగా రావడంతో పంపిణీ ఆలస్యమైంది. మండలం మొత్తం మీద అన్నిచోట్ల పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది.


నక్కపల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

రాంబిల్లి : మండలంలోని పెన్షనర్లకు ఉద్యోగులు, సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి పెన్షన్ డబ్బులు అందించాలని టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎరిపిల్లి అజయ్ కోరారు. ఈ మేరకు పలువురు పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఎంపీడీవోను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు ఎరిపల్లి చిట్టిబాబు, చెల్లూరి ఆనంద్, వెంకటరావు, అప్పలరాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

రైవాడ జలాశయంలో పూడిక తీయించండి


రైవాడ జలాశయం

దేవరాపల్లి, ఏప్రిల్ 3: మండలంలోని రైవాడ జలాశయం గర్భం, గట్టు అంతా తుప్పలు, చెట్లతో నిండిపోయింది. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే రైవాడ జలాశయం పట్ల వైసీపీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యాన్ని చూపుతు న్నారని రైతులు తెలిపారు. చెట్లు పెరగడంతో గట్టుకు ప్రమాదం పొంచి ఉంది. ఉపాధి హామీ పథకం నిధులతోనైనా రైవాడ జలాశయంలోని తుప్పలు తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి ఉపాధి హామీ నిధులతో తుప్పలు తొలగించాలన్నారు.

బైకు బోల్తా : యువకుడికి తీవ్ర గాయాలు

రావికమతం, ఏప్రిల్ 3 : మండలంలోని బుధవారం తట్టబంద గ్రామానికి చెందిన కట్టా ప్రసాద్ (20)కు బైకు బోల్తా పడిన ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. తట్టబంద నుంచి కింతలి గ్రామానికి వివాహానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రావికమతం సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడగా ప్రసాద్ గాయపడ్డాడు. వెంటనే ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం రావికమతం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

పాడేరు ఘాట్‌లో ఘోరం

- అదుపు తప్పి లోయలోకి బోల్తా పడిన బొలేరో
- ఇద్దరు మృతి : 30 మందికి గాయాలు

పాడేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్ రోడ్డులో బుధవారం రాత్రి ఘోరం జరిగింది. ప్రయాణికులతో కిక్కిరిసిన బొలేరో అదుపుతప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒక మహిళ (35), పురుషుడు(40) మృతి చెందగా మరో 30 మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి...

ఒడిశా రాష్ట్రం నుంచి కూలి పనుల కోసం 32 మంది బొలేరో వాహనంలో బుధవారం విజయవాడ బయలుదేరారు. పాడేరు మీదుగా మైదాన ప్రాంతానికి చేరే క్రమంలో రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో స్థానిక ఏసుప్రభు బొమ్మ మలుపునకు ముందున్న మలుపు వద్ద వాహనం అదుపు తప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఒక మహిళ, మరో పురుషుడు అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్‌తో సహా మరో 30 మందికి గాయాలయ్యాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారు గమనించి బొలేరోలో చిక్కుకున్న వారికి లోయలోంచి బయటకు తీశారు. అంబులెన్సులకు సమాచారం ఇచ్చి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా కూలీలేనని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రాత్రి సమయంలో సంఘటన జరగడంతో మృతులు, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

బలవంతపు రాజీనామాలు!

... 5వ పేజీ తరువాయి

తొలగించారు. దీంతో జిల్లాలో మొత్తం 285 మంది వలంటీర్లు విధుల నుంచి తప్పుకున్నారు. అది నుంచీ వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను ఎన్నికల్లో వాడుకోవాలని భావించింది. ఇందులో భాగంగానే సంక్షేమ కార్యక్రమాలకు వారితోనే ప్రచారం చేయించడంతో పాటు ఇంటింటికీ వెళ్లి అందించేలా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఈ ప్రక్రియ కొనసాగగా, వలంటీర్లు కార్యకర్తలను మించిపోయేలా వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తుండడంతో ఎన్నికల సంఘం రంగంలోకి దిగి కట్టడి చేసింది. ప్రధానంగా పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బందితో చేపట్టాలని ఆదేశించింది. దీంతో వలంటీర్లనే నమ్ముకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావించిన వైసీపీ నేతలకు ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో రంగంలోకి దిగిన కొంతమంది నాయకులు వలంటీర్లతో రాజీనామా చేయించి, ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలని కుయుక్తులు పన్నుతున్నారు. రాత్రిపూట రహస్య ప్రదేశాలలో వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొందరైతే ఏకంగా వలంటీర్లకు తాయిలాలు అందించి పార్టీ కార్యకర్తలుగా మార్చేశారు. వాస్తవానికి వలంటీర్లకు తమ బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఇష్టం లేకపోయినా వైసీపీ నాయకులు ఒత్తిడి తెచ్చిమరీ రాజీనామా చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వలంటీర్ల రాజీనామా వెనుక ఎవరి ఒత్తిడి ఉందో విచారణ జరిపించాలని విపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నర్సీపట్నం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి మరీ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని ప్రశ్నించడంతో ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ కారులో ఎక్కి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. ఆయనపై చర్యలు తీసుకోకుండా పోలీసులు వలంటీర్లను స్టేషన్‌కు తరలించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. చిన్నపాటి వ్యవస్థలో పనిచేస్తున్న వలంటీర్ల పై కేసులు పెట్టి, సమావేశం ఏర్పాటుచేసిన కీలక వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పై కేసు నమోదు చేయాలని కోరారు. నర్సీపట్నం: వలంటీర్లతో సమావేశం నిర్వహించిన సంఘటనపై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, ఇంటి యజమాని కర్రి రాంగోపాల్‌పై కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు. వలంటీర్లతో ఓటర్లకు డబ్బులు పంచి ప్రలోభపెట్టేందుకే సమావేశం నిర్వహించారని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు.

సి-విజిల్‌తో ఉల్లంఘనలకు చెక్!

... 5వ పేజీ తరువాయి

గోప్యంగా ఉంచుతారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండిలా....

సి-విజిల్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇన్‌స్టాల్ చేసేందుకు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గ కేంద్రాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఫొటోలు, వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేసి ఉన్నతాధికారులకు పంపవచ్చు. అయితే ఆ సమయంలో మొబైల్‌లో జీపీఎస్ ఆన్‌లో ఉంచాలి. దాని ఆధారంగానే అధికారులు సంబంధిత ప్రాంతానికి చేరుకోగలరు.

ఫిర్యాదుల వెల్లువ....

జిల్లాలో ఇప్పటివరకు సి-విజిల్ యాప్‌కు 371 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి ప్రసాద్ తెలిపారు. ఎక్కువగా పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 150కిపైగా ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో అధికంగా పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించలేదని, విగ్రహాలకు ముసుగులు వేయలేదని, భవనాలకు, శిలాఫలకాల రంగులు మార్చలేదనేవే ఉన్నాయని, వాటిని పరిశీలించి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

ఆలస్యంగా పింఛన్ల పంపిణీ ప్రారంభం

- మధ్యాహ్నం వరకు విడుదల కాని సొమ్ము
- బ్యాంకుల్లో పింఛను డబ్బు డ్రా చేసిన అడ్మిన్ సెక్రటరీలు
- సచివాలయ ఉద్యోగులందరికీ లాగిన్ ఇచ్చిన ప్రభుత్వం
- క్యూలో ఉండి పింఛను డబ్బులు తీసుకున్న లబ్ధిదారులు


వడ్డాది సచివాలయంలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, నర్సీపట్నం అర్బన్ ఏప్రిల్ 3 : మండలంలో గ్రామ, వార్డు సచివాయాల వద్ద బుధవారం సాయంత్రం తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. బుధవారం మధ్యాహ్నం వరకు బ్యాంకుల్లో పింఛన్ల డబ్బులు పడలేదు. అనంతరం డబ్బులు జమ కావడంతో సాయంత్రం తర్వాత పంపిణీ మొదలైంది. వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలుబ్యాంకులో డబ్బులు డ్రా చేసి సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. సచివాలయ ఉద్యోగులు అందరికీ లాగిన్ ఇచ్చారు. మునిసిపాలిటీ పరిధిలో 17 సచివాలయాలలో 7,279 లబ్ధిదారులకు రూ.2,19,21,500 పింఛను సొమ్ము బ్యాంకుల్లో జమ అయ్యాయి. నర్సీపట్నం గ్రామీణ ప్రాంతంలోని తొమ్మిది సచివాయల పరిధిలో 5,135 మంది లబ్ధిదారులకు రూ.1.57 కోట్లు విడుదలయ్యాయి. మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు పాత మునిసిపల్ కార్యాలయంలో సచివాలయల వద్ద పింఛను పంపిణీ పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో సచివాలయాల వద్ద ఎంపీడీవో జాన్ లింకన్ పింఛను పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారులు క్యూలో ఉండి పింఛను సొమ్ము తీసుకున్నారు. రాత్రి ఏ సమయమైనా సాధ్యమైనంత వరకు లబ్ధిదారులు అందరికి పింఛన్లు అందజేయాలని ఆదేశించారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేశారు. వాణిజ్య బ్యాంకులో నగదు విత్‌డ్రా ఆలస్యం కావడంతో మధ్యాహ్నం నుంచి పింఛన్లు పంపిణీ చేపట్టారు. 6వ తేదీ వరకు సచివాలయాల్లో పంపిణీ చేస్తామని, అనంతరం నడవలేని వృద్ధులకు వికలాంగులకు ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేపడతామని వడ్డాది పంచాయతీ ఈవో లవరాజు తెలిపారు.

వైసీపీపై భ్రమలు తొలగాయి

- చోడవరంలో టీడీపీ గెలుపు తథ్యం
- మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఏప్రిల్ 3: వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న భ్రమలు తొలగిపోయాయని, రాష్ట్రంలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఇక లాంఛనమేనని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ పేరుతో జగన్ మాయమాటలు నమ్మి వైసీపీలో చేరిన వారందరికీ ప్రస్తుతం ఆ పార్టీలో ఎందుకు కొనసాగుతున్నామా అని మధనపడుతున్నారన్నారు. త్వరలో వైసీపీ ఖాళీ కావడం ఖాయమన్నారు. ఆ పార్టీలోని వారంతా టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూతి కోటేశ్వరరావు, మాజీఎంపీపీ పెదబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్సరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, బీజేపీ నాయకులు కందర్ప రామకృష్ణ, టీడీపీ నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

- టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు


వృద్ధురాలి వద్ద కొనుగోలు చేస్తున్న పైలా ప్రసాదరావు

కె.కోటపాడు, ఏప్రిల్ 3: ప్రజా ప్రభుత్వం కోసం అసెంబ్లీ, ఎంపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు కోరారు. బుధవారం మండలంలోని గుల్లిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాదరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. అసెంబ్లీకి తనను, పార్లమెంట్‌కు సీఎం రమేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, సర్పంచులు దాడి ఎరుకునాయుడు, పూడి నారాయణమూర్తి, బొడ్డు అక్కునాయుడు, మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బి. సంతోష్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు రాళ్లపల్లి దేముడు, ఎంపీటీసీ సభ్యుడు కొరెడ్డి దేముడుబాబు పాల్గొన్నారు.


పైపులైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

పగిలిన పైపులైన్

- వృథాగా పోతున్న తాగునీరు

రోలుగుంట, ఏప్రిల్ 3 : మండలంలోని కొమరవోలులో తరచూ పైపులైన్లు పగిలి తాగునీరు వృథాగా పోతున్నది. దీంతో ప్రజలు తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిలో భాగంగానే ఇటీవలే నూతనంగా స్థానిక కన్నంపేట వరహానది నుంచి కొమరవోలు వరకు పైపులైన్లు వేసి తాగునీటిని అందిస్తున్నారు. కాగా బుధవారం గ్రామ శివారున పైపులైన్ పగిలి ఉదయం నుంచి తాగునీరు వృథా పోతున్నది. దీంతో తాగునీరు అందడం లేదు. కొత్త పైపులైన్లు వేసినా పగిలిపోవడం ఏంటని, నాణ్యత లేని పైపులు వేశారా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధింత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రం సందర్శించిన కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం, ఏప్రిల్ 3 : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వేసవిని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేశామని కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు. ఐదు రోడ్ల కూడలిలోని వినాయకుడి, అబీద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, పోలీస్ స్టేషన్ సమీపం, ఎల్‌బీసీ ఆఫీసు వద్ద, పెదబొడ్డేపల్లి కూడలి వద్ద చలివేంద్రాలు పెట్టామని ఆయన తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలో చలివేంద్రాలు నిర్వహణకు రూ.2.2లక్షలు కేటాయించినట్టు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం : టీడీపీ

మాడుగుల రూరల్, ఏప్రిల్ 3 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ మాడుగుల మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అవురువాడ, లోవపొన్నవోలు, జాలంపల్లి పంచాయతీ గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీల కార్యకర్తలను కలుసుకున్నారు. పార్టీ నిర్దేశానుసారం అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను కమలం గుర్తుపై, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా పైలా ప్రసాదరావుకి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు ఉండూరు రాజు, టీడీపీ యూత్ నాయకులు వడ్డిరాజ్‌కుమార్, చక్రవర్తిరాజు, అప్పారావు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 65 మందికి పరీక్షలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 3: వడ్డాదిలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టరు జాన్ 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 22 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరంలో కో-ఆర్డినేటర్ అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్

... 5వ పేజీ తరువాయి

తొలి అర్ధ సెంచరీ (54; 3 సిక్సర్లు, 5 బౌండరీలు) సాధించాడు. మరోవైపు కేవలం 39 బంతుల్లో ఏడు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 85 పరుగులు చేసిన సునీల్ నరైన్ (85) రెండో వికెట్‌గా అవుటయ్యాడు. ఆ తర్వాత స్థానాల్లో దిగిన ఆండ్రూ రస్సెల్ (41), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (18), రింకూ సింగ్ (26) సిక్సర్లు, బౌండరీలతో విరుచుపడడంతో జట్టు స్కోరు 272 పరుగులకు చేరింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిషభ్ పంత్ (55), స్టబ్స్ (54) అర్ధ సెంచరీలు సాధించగా, మిగిలిన బ్యాట్స్‌మెన్లు ఘోరంగా విఫలమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి తలో మూడు వికెట్లు పడగొట్టగా, మిచెల్ స్టార్క్ రెండు వికెట్లు తీశాడు.

షారుఖ్ ఖాన్ సందడి

గోపాలపట్నం (విశాఖపట్నం), ఏప్రిల్ 3: స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించడానికి ఆయా జట్ల యజమానులు ప్రత్యేక విమానాల్లో నగరానికి చేరుకున్నారు. ముంబై నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసిన బాలీవుడ్ నటుడు, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్‌కు విమానాశ్రయంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో స్టేడియానికి వెళ్లారు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ జిందాల్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి వచ్చారు. షారుక్ స్టేడియంలో మ్యాచ్ జరుగుతున్నప్పుడు తన జట్టు సభ్యులను ఉత్సాహపరుస్తూ కనిపించారు.

వార్డు వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు

నర్సీపట్నం, ఏప్రిల్ 3 : మునిసిపాలిటీలోని పలువురు వార్డు వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. బలిఘట్టంలో 14, కొత్త బైయపురెడ్డిపాలెంలో 17, అయ్యన్నకాలనీలో 15, పెదబొడ్డేపల్లిలో 6 మంది, ఎనిమిదో వార్డులో ఆరుగురు, కొత్తవీధి, అయ్యన్నపాలెం, శారదానగర్‌లో ఒక్కొక్కరు చొప్పున రాజీనామాలు చేశారు. బుధవారం రాజీనామా పత్రాలను మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబుకి అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రోలుగుంట, ఏప్రిల్ 3 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.జాన్ లింకన్ తలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులంతా హాజరుకావాలని కోరారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

- ఎంపీడీవో జాన్‌లింకన్


సమావేశంలో మాట్లాడుతున్న కె.జాన్ లింకన్

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 3 : మండలంలోని పింఛన్‌దారులకు ఏప్రిల్ నెలకు సంబంధించి కోటి 56 లక్షల 38 వేలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి పనులకు అవసరమైన టెంట్‌లు, తాగునీరు అందించేటట్లు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


భోగాపురంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చోడవరం, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని భోగాపురం, నరసాపురం, అడ్డూరు, సేమునాపల్లి, దుడ్డుపాలెం, డి. బుచ్చెయ్యపేట తదితర గ్రామాల్లో బుధవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా స్థానిక సీఐ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు కవాతు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శేఖరం పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం



ఆటిజం దినోత్సవంలో పాల్గొన్న ఎంఈవో జయలక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయులు

చోడవరం, ఏప్రిల్ 3: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బి.జయలక్ష్మి పిల్లల్లో ఆటిజంపై తల్లిదండ్రుల్లో అవగాహన అవసరమని, తల్లిదండ్రులు ఆటిజం పిల్లలకు అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బాలికల హైస్కూల్ హెచ్‌ఎం రామిరెడ్డి, ఏడు మమండలాలకు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయులు మహలక్ష్మి, నాయుడు, సత్యనారాయణ, రమేష్, పరదేశి, శ్రీదేవి, సరస్వతి, దివ్యాంగ బాలలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

కె.కోటపాడు, ఏప్రిల్ 3 : స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో బుధవారం చలివేంద్రాన్ని తహసీల్దార్ జె. ఈశ్వరమ్మ ప్రారంభించారు. ప్రతి రోజు కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలి


జె.నాయుడుపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిచంద్ర

రోలుగుంట, ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రవిచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని జె.నాయుడుపాలెంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల్లోని విద్యుత్, ఫర్నిచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధుల దివ్యాంగుల కొరకు ర్యాంపులను తక్షణమే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన నాతవరం మాజీ ఉపసర్పంచ్


సీఎం రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరిన సూర్యనారాయణ

నాతవరం, ఏప్రిల్ 3 : నాతవరం మాజీ ఉపసర్పంచ్ యర్రా సూర్యనారాయణ మంగళవారం నర్సీపట్నంలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు యర్రా సూర్యనారాయణ నాతవరం ఉపసర్పంచ్‌గా పనిచేశారు. సూర్యనారాయణ చేరిక పట్ల స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామాన్యుడ్ని ఉప ముఖ్యమంత్రి చేసిన జగన్ : బూడి


బూడి ముత్యాలనాయుడుకి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, ఏప్రిల్ 3 : సామాన్యుడునైన తనను ఉప ముఖ్యమంత్రి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైసీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ స్థానానికి ధనికుడుకి, సామాన్యుడికి మధ్య పోటీ జరుగుతుందన్నారు. స్థానికేతురుడైన సీఎం రమేశ్‌కి ఓటు వేసి గెలిపిస్తే వ్యాపారం చేసుకోవడానికి ఢిల్లీ పోతాడని అన్నారు. ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకి 30 వేలు మెజారిటీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ, సీహెచ్. సన్యాసిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు వైసీపీకి తొత్తులుగా పనిచేయడం మానుకోవాలి : బీజేపీ


విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నాతవరం, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో కొందరు పోలీసులు ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా వైసీపీకి తొత్తులుగా పనిచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు మద్దు రామకృష్ణంరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్ల నుంచి రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడిసిందన్నారు. వైసీపీకి తొత్తులుగా పనిచేస్తున్న కొందరిపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసిందని, ఇకనైనా పోలీసులు నిష్పాక్షపాతంగా పనిచేయాలన్నారు. అలాగే బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ని గెలిపిస్తే కేంద్రప్రభుత్వ నిధులు తీసుకువచ్చిన అనకాపల్లి పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు పేరూరి బుల్లిదొర, ఎం. గణేష్ రామచంద్రరాజు పాల్గొన్నారు.

నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ రేపు

చీడికాడ, ఏప్రిల్ 3: ఈనెల 5వ తేదీన చీడికాడలో నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని గ్రామానికి చెందిన దోకలవారి కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటల తరువాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం పురోహితులు గరిమెళ్ల ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం అన్నసమారాధన, మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా స్థాయి ఎడ్లపరుగు పోటీలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.